11

# సిలువ: దాని వాస్తవము

నాకొక స్నేహితుడున్నాడు, అతడు ప్రార్థన నడిపించునప్పుడు, యేసు క్రీస్తు కొరకు, మన పాపముల విమోచనార్థమై నిజముగా మరణించిన వాని కొరకు, దేవునికి దాదాపుగా ఎల్లప్పుడు వందనములు చెల్లిస్తుంటాడు. నా స్నేహితుడు సరైన పనే చేస్తున్నాడు: యేసు – దేవుని కుమారుడు; ప్రవక్త, యాజకుడు, మరియు రాజు; మన రక్షకుడు – మన పాపముల క్షమాపణ నిమిత్తమై నిజముగా సిలువపై మరణించాడు. ఆయన మరణము ఒక నైజమై యున్నది.

ఆ మరణమును (కొంత వరకు) లూకా వర్ణిస్తున్నాడు:

> వారు కపాలమనబడిన స్థలమునకు వచ్చినప్పుడు అక్కడ కుడివైపున ఒకనిని ఎడమవైపున ఒకనిని ఆ నేరస్థులను ఆయనతోకూడా సిలువవేసిరి. యేసు – తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని చెప్పెను. వారు ఆయన వస్త్రములు పంచుకొనుటకై చీట్లువేసిరి. ప్రజలు నిలువబడి చూచుచుండిరి; అధికారులును – వీడు ఇతరులను రక్షించెను; వీడు దేవుడేర్పచుకొనిన క్రీస్తు అయినయెడల తన్నుతాను రక్షించుకొనునని అపహసించిరి. అంతట సైనికులు ఆయనయొద్దకు వచ్చి ఆయనకు చిరకనిచ్చి – నీవు యూదుల రాజువైతే నిన్ను నీవే రక్షించుకొనుమని ఆయనను అపహసించిరి – ఇతడు యూదుల రాజని పైవిలాసముకూడ ఆయనకు పైగా వ్రాయబడెను.
>
> వ్రేలాడవేయబడిన ఆ నేరస్థులలో ఒకడు ఆయనను దూషించుచు – నీవు క్రీస్తువు గదా? నిన్ను నీవు రక్షించుకొనుము, మమ్మునుకూడ రక్షించుమని చెప్పెను. అయితే రెండవవాడు వానిని గద్దించి – నీవు అదే శిక్షావిధిలో ఉన్నావు గనుక దేవునికి భయపడవా? మనకైతే యిది న్యాయమే; మనము చేసినవాటికి తగిన ఫలము పొందుచున్నాము గాని యీయన ఏ తప్పిదమును చేయలేదని చెప్పి ఆయనను చూచి – యేసూ, నీవు నీ రాజ్యములోనికి వచ్చునప్పుడు నన్ను జ్ఞాపకము చేసికొనుమనెను. అందుకాయన వానితో – నేడు నీవు నాతోకూడ పరదైసులో ఉందువని నిశ్చయముగా నీతో చెప్పుచున్నాననెను. అప్పుడు రమారమి మధ్యాహ్నమాయెను. అది మొదలుకొని మూడు గంటలవరకు ఆ దేశమంతటిమీద చీకటి కమ్మెను; సూర్యుడు అదృశ్యుడాయెను; గర్భాలయపు తెర నడిమికి చినిగెను. అప్పుడు యేసు గొప్ప శబ్దముతో కేకవేసి – తండ్రీ, నీ చేతికి నా ఆత్మను అప్పగించుకొనుచున్నాననెను. ఆయన యీలాగు చెప్పి ప్రాణము విడిచెను (లూకా 23:33–46).

"అక్కడ వారు ఆయనను సిలువవేసిరి." సిలువవేయబడుట ఎలా ఉండినది, మరియు మనకు దాని అర్థమేమైయున్నది? యేసు క్రీస్తు సిలువవేయబడినప్పుడు ఆయన మన కొరకు ఏమి చేసెనో మరింత స్పష్టంగా చూడవలెననునది ఈ పాఠము యొక్క ఉద్దేశమై యున్నది. సిలువవేయబడుట గూర్చిన ఇతివృత్తమును ఐదు అంకములు గల నాటకమువలె మనము చూడవచ్చును.

### మొదటి అంకము: చివరి రాత్రి భోజనము

వారు పస్కాను భుజించవలసి యుండిన ఇంటి యజమానుని యొద్దకు యేసు ఇద్దరు

శిష్యులను పంపించి ఒక మేడ గదిని ఏర్పాటు చేసాడు. ఆనాటి చివరి రాత్రి భోజన సమయంలో యేసు పళ్లెములో నీళ్లు తీసికొని వంగి శిష్యుల పాదములు కడిగాడు, తద్వారా వినయమును గూర్చిన విశేష మాదిరిని వారికి ఆచరణాత్మకంగా చూపించాడు. వారితో సుదీర్ఘముగా సంభాషించాడు (యోహాను 14-16 అధ్యాయములు చూడండి). ఏదిఏమైనా, మనమందరమును ఎరిగియున్న "ప్రభు భోజన సంస్కారము"ను ఆయన వ్యవస్థాపించుట ఈ అంకములోని ప్రధాన ఘట్టమై యుండినది.

యేసు రొట్టెను పట్టుకొని, కృతజ్ఞతాస్తుతులు చెల్లించి, దానిని విరిచి, "ఇది మీ కొరకు ఇయ్యబడుచున్న నా శరీరము" అని చెప్పుచు తన శిష్యులకిచ్చాడు (లూకా 22:19). అటుతరువాత ఆయన గిన్నె పట్టుకొని, కృతజ్ఞతాస్తుతులు చెల్లించి, "ఈ గిన్నె మీ కొరకు చిందింపబడుచున్న నా రక్తము వలనైన క్రొత్త నిబంధన" అని చెప్పాడు (లూకా 22:20). "మీరు దీనిలోనిది త్రాగునప్పుడెల్లా, నన్ను జ్ఞాపకము చేసికొనుటకై, దీన్ని చేయుడి" అని కూడా ఆయన వారితో చెప్పాడు (1 కొరింథీయులకు 11:25సి).

విచారకరమైన ఈ పస్కా భోజనము వింతైన విధంగా మనస్సును కదిలించి కరిగించునదై యున్నది. అచ్చట క్రీస్తు, నలువైపుల శత్రుసమూహము చేత చుట్టుముట్టబడి, ఆయన అపొస్తలులు విశ్వాసపాత్రముకానివారై యుందురని ఆయనకు ఎరుకై యున్న విషయమును తన కళ్లముందుంచుకొని, ఆయన చేయని తప్పులకు శిక్షగా పొంచియుండిన బాధాకరమైన మరణమును చూచుచున్నాడు - అట్లయినను ఆయన రాబోవు తరములు మరియు వారు జ్ఞాపకముంచుకొనవలసిన తన సర్వోచ్ఛమైన బలియాగము గూర్చి లోతుగా ఆలోచించుచున్నాడు. చివరి రాత్రి భోజన సంస్కారమును వ్యవస్థాపించుట నిస్వార్థముతో కూడిన ఒక చర్యయై యుండినది. గనుక అది సిలువ నీడలో సంభవించినదని జ్ఞాపకమునకు తెచ్చుకొనుచు దానిలో యోగ్యమైన విధంగా పాల్గొందము.

ప్రభు భోజనము మూడు ముఖ్యమైన సత్యములను మన జ్ఞాపకమునకు తెచ్చును: క్రీస్తు మన కొరకు మరణించాడు; మనము పాపులమై యున్నాము; మరియు ఆయన తిరిగి వచ్చునని క్రీస్తు వాగ్దానం చేసాడు. ఈ సంస్కారమును మనము తేలికగా పరిగణించునప్పుడెల్లా దేవుడు మనలను క్షమించునుగాక! ఈసారి నీవు పాల్గొనునప్పుడు, ముళ్ల కిరీటముతో గాయపడిన శిరస్సు, రక్తము కారుచున్న హస్తములు, చిల్లిబడపొడువబడిన ప్రక్క, మరియు "ఇది నా రక్తము, అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుచున్న క్రొత్త నిబంధన రక్తము" (మత్తయి 26:28) అనియు, "నన్ను జ్ఞాపకము చేసికొనుటకు దీనిని చేయుడి" (లూకా 22:19) అనియు చెప్పిన రక్షకుడు నీ కళ్ల ముందున్నట్లు భావించుకొనుము. చిందింపబడిన క్రీస్తు రక్తము మరియు నలుగగొట్టబడిన శరీరము యొక్క ఈ స్మారకోత్సవములో అయోగ్యముగా పాల్గొను ప్రతివాడును ప్రభువును మరలా సిలువవేసిన దోషియగును. మనము ప్రభు భోజనములో పాల్గొనునప్పుడు మనలను మనము సిలువ దృష్ట్యా పరీక్షించుకొనుచు పాల్గొనవలెను (1 కొరింథీయులకు 11:27-29).

### రెండవ అంకము: తోట

పస్కా భోజనమైన తరువాత, యేసు మరియు ఆయన అపొస్తలులు గెత్సేమనే తోటకు వెళ్లారు. తోట ద్వారమునకు దగ్గర్లో ఆయన శిష్యులలోని ఎక్కువ మందిని వదిలిపెట్టి,

యేసు పేతురును, యాకోబును, మరియు యోహానును వెంటబెట్టుకొని యింకా కొంచెము ముందుకు వెళ్లాడు. ఆ తరువాత వారు తనతో కూడ మెలకువగా ఉండవలసినదని వారికి చెప్పి, ఈ ముగ్గురిని కూడా వదిలిపెట్టి. ఆయనొక్కడే ఒంటరిగా ప్రార్థించుటకు యింకా కొంచెము ముందుకు వెళ్లాడు. ముమ్మారు కూడ ఆయన "నా తండ్రీ, సాధ్యమైతే, ఈ గిన్నె నా యొద్ద నుండి తొలగిపోనిమ్ము; అయినను నా యిష్టప్రకారము కాదు, నీ చిత్తప్రకారమే కానిమ్ము" అని ప్రార్థించాడు (మత్తయి 26:39; వచనాలు 42, 44 చూడుము). సరికదా ఆయన ముమ్మారు తిరిగి వచ్చి చూచినప్పుడు నమ్మకమైన ఆయన ముగ్గురు స్నేహితులు నిద్రించుచుండినట్లు గమనించాడు. చివరిసారి ఆయన కత్తులతోను గుదియలతోను సాయుధులై, నమ్మకద్రోహియైన యూదా చేత నడిపింపబడి వచ్చిన జనసమూహమును కలుసుకొన్నాడు. ఒక్క ముద్దుతో యూదా ఆయనను వారికి అప్పగించాడు; గనుక యేసు తీర్పు తీర్చబడుటకును, పిలాతు యెదుటికిని, గొల్గొతాకును, చివరకు మరణించుటకును జనసమూహముతో కూడ వెళ్లాడు.

ఈ అంకము తీక్షణతతో నిండియున్నది: యేసు ప్రార్థనలలో గల వాంఛ, శిష్యులలో ఉండిన బలహీనత, అంతవరకు ఎన్నడూ చూడని విధంగా ఆయనను సమీపించుచుండిన జనసమూహము, భయభీతిని ప్రేరేపించు దేవుని సన్నిధి, క్రీస్తు పక్షమున అతడు పోరాడుచున్నాడన్నట్లుగా పేతురు మల్కు యొక్క చెవిని తెగనరుకుట మరియు యేసు వెంటనే చూపించిన ఆశ్చర్యకరమైన ప్రతిస్పందన, విద్రోహియైన యూదా పెట్టిన ముద్దు, ఊరేగింపు ప్రధాన యాజకుని ఇంటి వైపుగా కదలివెళ్లుట, మరియు అతడు యేసును "దూరము నుండి" (మత్తయి 26:58) వెంబడించుచు తనను తాను క్రీస్తుతో కూడ గుర్తించుకొనుటకు పేతురు కనుపర్చిన అయిష్టము మొదలయిన పరిస్థితులతో నిండియున్నది. ఏదిఏమైనా, సమయము చాలా తక్కువగా ఉన్నందునుబట్టి మనము ఈ సంఘటనల వివరములలోనికి వెళ్లుటలేదు.

దానికి బదులుగా మనము క్రీస్తు చేసిన ప్రార్థన: "ఈ గిన్నె నా యొద్ద నుండి తొలగిపోనిమ్ము; అయినను నా యిష్ట ప్రకారము కాదు, నీ చిత్త ప్రకారమే కానిమ్ము" గూర్చి యోచించుదాము. ఆయన ఆనాడు తన ముందుండిన శ్రమలను అనుభవించకుండుటకు గల అవకాశమును గూర్చి యేసు ఎంతో మనఃపూర్వకంగా ప్రార్థించుచుండెను. మనము ఆయనను గెత్సేమనే వనములో తేరి చూచుచు ఆయన చెమట నేల పడుచున్న గొప్ప రక్త బిందువుల వలె అగుచుండుటను గమనించుచు, ఆయన హృదయ వేదనను మనము కూడా అనుభూతి చెందుదము మరియు ఆయన పెట్టుచున్న ఆవేశంలేని కేకను ఆలకించుదము. "దేవుడు ఆయన ప్రార్థనకు ఎందుకు ప్రత్యుత్తరమీయలేదు? "అని అడుగకుండా కరిగిపోయిన మన మనస్సులు మౌనంగా ఉండలేవు?"

క్రీస్తు ఎందుకింత బాధాకరమైన మరణమునొందవలసి వచ్చింది? మన మానవ హేతువాదము మానవాళి రక్షణార్థమైన కొన్ని ఇతర సాధనోపాయములను సలహా ఇవ్వవచ్చును, కానీ దేవుని ప్రణాళిక సామాన్యమైనదై యుండినది: మనము రక్షింపబడక మునుపు యేసు మరణించవలెను. రక్తము చిందింపకుండా పాపక్షమాపణ కలుగదని పరిశుద్ధ సత్యవేదము చెప్పుచున్నది (హెబ్రీయులకు 9:22), జంతువుల బల్యర్పణ ద్వారా చిందింపబడు రక్తము పాపమును తొలగించలేదని కూడా అది సూచించుచున్నది (హెబ్రీయులకు 10:4). క్రీస్తు రక్తము మాత్రమే మన పాపములకు క్షమాపణ సమకూర్చగలదు.

ఎందుకని? ఈ ప్రశ్నకు మనము సమాధానము ఇవ్వగలిగినా లేక ఇవ్వలేకపోయినా, పరిశుద్ధ బైబిలు ఉపదేశించుచున్నది ఇదే అని మనము ధైర్యముతో చెప్పగలము, మరియు మనము దానిని నమ్మగలము: యేసు మరణించవలసి యుండినది. ఆయన సిలువ మీద వ్రేలాడుచుండినప్పుడు, "ఈయన ఇతరులను రక్షించాడు; తన్ను తాను రక్షించుకొనును" అని కొందరన్నారు (లూకా 23:35). వారు ఆయన యెడల ఒక గమనార్హమైన శ్రద్ధాంజలి ఘటించారు కానీ అది వారికి తెలియకుండనే ఎటువంటి సదుద్దేశము లేనిదై యుండెను. "ఈయన ఇతరులను రక్షించాడు" అను ఒప్పుకోలు మాటలు ఆయన శత్రువులు నోట నుండి వినిపించినవి. కానీ ఆ తరువాత వారు అసలు విషయాన్ని అర్థంచేసికోలేకపోయారు: ఆయన తనను తాను రక్షించుకొని యుండినట్లయితే ఆయన ఇతరులను రక్షించలేకపోయేవాడు!

యేసు ఎందుకు మరణించాల్సి వచ్చిందో మనము నిశ్చయతతో చెప్పలేకపోవచ్చును, కానీ సిలువ చేత ప్రకటింపబడిన రెండు సత్యములను మనము అంగీకరించవచ్చును: (1) *సిలువ పాపము యొక్క దుష్టబుద్ధితో కూడిన దూషణను ప్రకటించుచున్నది.* పాపము ఎంత చెడ్డది? యేసు క్రీస్తు మరణించి యుండకపోయినట్లయితే, పాపము ఎంత చెడ్డదో మనకు ఎన్నటికినీ ఎరుకయ్యేదే కాదు. పాపము ఎంత భయంకరమైనదంటే దానిని తుడిచివేయుటకు క్రీస్తు మరణించవలసిన అవసరం వచ్చింది. (2) *సిలువ దేవుని ప్రేమను కూడ వ్యక్తము చేయుచున్నది.* దేవుడు మనలను ఎంతగా ప్రేమించుచున్నాడు? ఆయన మనలను సమృద్ధిగా ఆశీర్వదించినప్పటికిని, ఆయన తన ప్రేమను ఈ విధంగా వెల్లడిపర్చకుండా ఉండియుంటే ఆ ప్రేమ యొక్క నిండైన పరిమాణము మనకు ఎన్నడును ఎరుకయ్యేదే కాదు: "అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడిచేయుచున్నాడు; ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను" (రోమీయులకు 5:8).

అదే విధంగా, మనము క్రీస్తును సిలువ మీద వ్రేలాడుట చూడకుండా ఉండియున్నట్లయితే దేవుని ప్రేమ యొక్క పరిపూర్ణ పరిమాణము మనకు ఎన్నడును తెలిసేదే కాదు. క్రీస్తు సిలువవేయబడక మునుపు, ఆయనకు "చేదు కలిపిన ద్రాక్షారసము" అందించబడినది (మత్తయి 27:34). ఈ మిశ్రమము నొప్పిని ఉపశమనం చేయు ఒక పానీయమై యుండినది. ఇది మత్తు కలుగజేస్తుంది గనుక సిలువవేయబడిన వ్యక్తికి దాని బాధ అంతగా తెలియదు. క్రీస్తు ఈ మిశ్రమమును తీసికొనుటకు నిరాకరించాడు ఏలయనగా ఆయన క్రూరమైన అట్టి మరణము వలన కలుగు వేదన అంతటిని అనుభవించుటకే స్థిరనిశ్చయముగలవాడై యుండెను, క్రీస్తు ప్రేమ ఈ బాధాకరమైన మరణమునకు, మత్తు మందు చేత ఉపశమనము కలుగని మరణమునకు, ఆయనను తీసుకువెళ్లినది.

## మూడవ అంకము: తీర్పులు

యేసు ఆయన శత్రువుల చేతికి అప్పగింపబడుటతో మన రంగస్థల ప్రదర్శన కొనసాగుచున్నది. ఈ మూడవ అంకములో, మానవుని ప్రవర్తన గూర్చి ఎప్పుడైనా నమోదు చేయబడిన అత్యంత దుఃఖకరమైన సన్నివేశమును చూస్తాము: యూదులు తీవ్రమైన ద్వేషము, అపొస్తలుల పిరికితనము, మరియు పిలాతు యొక్క విశ్వాసఘాతుకత్వం.

న్యాయవిచారణలకు సంబంధించిన ఇతివృత్తము కూడా మనకు సూటిగా అర్థమగుటకు సిలువవేయబడుటలోని చాలా కష్టమైన భాగమై యున్నది. గనుక వాస్తవములను మనము

సంక్షిప్తముగా పునః సమీక్షించుదాము. యేసు న్యాయవిచారణ రెండు ప్రధాన భాగములుగా ఉన్నది. ఆయన యూదుల యెదుట తీర్పు తీర్చబడి ఖండింపబడినాడు, మరియు ఆ తరువాత రోమీయ అధికారుల యెదుట ఆయనకు తీర్పు తీర్చబడింది.

*యూదీయ న్యాయవిచారణ.* యేసు విషయంలో యూదులు యెదుట జరిపింపబడిన మూడు దశలవారీ న్యాయవిచారణ ఆయనను అన్న ఇంటికి, కొందరి చేత ప్రధాన యాజకుడని గుర్తింపబడినవాని ఇంటికి తీసికొని వెళ్లుటతో మొదలయ్యింది. అక్కడ యేసు నిందింపబడినాడు. ఆ తరువాత ఆయనను కయప, ఆ సంవత్సరము ప్రధాన యాజకుని బాధ్యతలు చేపట్టినవాడైన కయప, ఇంటికి తీసికొనివెళ్లారు. యేసుపై నేరారోపణ చేయుచుండిన వారు అక్కడ గుమికూడి యుండిరి, గనుక ఆయన దోషి యని మరొక పర్యాము అబద్ధ సాక్షుల చేత కుయుక్తాగా మోపబడిన ఆరోపణలనుబట్టి తీర్పు ఇవ్వబడింది. యేసు న్యాయవిచారణకు సంబంధించిన ఈ తొలి రెండు దశలు ఆయన పట్టబడిన వెంటనే, మధ్య రాత్రి సమయంలో, జరిగియుండును.

వారు దేవాలయమును కూల్చివేసినట్లయితే ఆయన దానిని మూడు దినములలో మరలా కట్టెదనని చెప్పాడని యేసు నిందింపబడినాడు. ఈ ఆరోపణకు ఆయన ఎటువంటి సమాధానం ఇవ్వలేదు. అప్పుడు ప్రధాన యాజకుడు "నీవు దేవుని కుమారుడవైన క్రీస్తువైతే ఆ మాట మాతో చెప్పుమని జీవముగల దేవుని తోడని నీకు ఆనబెట్టుచున్నాను" అని స్వాధికారంతో యేసును ప్రశ్నించాడు (మత్తయి 26:63). అందుకు యేసు, "నీవన్నట్టే; ఇది మొదలుకొని మనుష్యకుమారుడు సర్వశక్తుని కుడిపార్శ్వమున కూర్చుండుటయు, ఆకాశ మేఘారూఢుడై వచ్చుటయు మీరు చూతురు" అని సమాధానమిచ్చాడు (మత్తయి 26:64). ఆయన ఇలా ఒప్పుకొన్నప్పుడు, యేసు దేవదూషణ చేయుచున్న దోషిగా నిర్ధారింపబడినాడు. ఆయన శత్రువులు ఆయనపై ఉమ్మివేసి, ఆయనను అవహేళన చేసి, గుద్దిన తరువాత, ఉదయం వరకు ఆయనను కావలిలో ఉంచారు. ఈ మధ్య కాలములోని అనేక గంటల వ్యవధిలో, ఆయన నిస్సందేహంగా యింకా ఎక్కువ పరిహసింపబడి ఎగతాళి చేయబడియుండును. రాత్రివేళలో, యేసు ఒక చోట నుండి మరొక చోటికి తీసికొనిపోబడుచుండగా, ఆయన అదే సమయంలో యేసును ఎరుగనని మూడవసారి బొంకుచుండిన పేతురు వైపు చూసాడు. తెల్లవారుచుండగా, ఆయనకు న్యాయవిచారణ జరిపింపబడి అధికారికంగా తీర్పు ఇవ్వబడవలెనని సన్‌హెడ్రిన్ సభ యెదుటికి, ప్రభుత్వాధికారములో ఉండిన యూదుల మహా సభ యెదుటికి, ఆయనను తీసికొని వెళ్లారు.

*రోమీయ న్యాయవిచారణ.* ఆయనను పిలాతు, రోమా సామ్రాజ్యములోని యూదా దేశ ప్రాంతీయ పరిపాలకుడైన పిలాతు, యెదుటికి తీసికొని వెళ్లినప్పుడు, న్యాయవిచారణ లోని రెండవ భాగము మొదలయ్యింది. యూదులై యుండి యేసును రోమీయ అధికారుల యెదుటికి తీసికొనిరావలసి వచ్చినది ఏలయనగా వారు చెరపట్టబడిన ప్రజలై యుండి ఒక నేరస్థునికి మరణ దండన విధించగల హక్కులేనివారై యుండిరి. యేసు న్యాయవిచారణలోని రెండవ భాగము మూడు దశలలో జరిగినది.

పిలాతు యేసును ప్రశ్నించి ఆయనలో ఏ దోషమైనను లేదని కనుగొన్నాడు. యేసు గలిలయవాడని తెలిసికొని, ఆయనను హేరోదు అంతిపయ, గలిలయ ప్రాంతీయ పరిపాలన యొద్దకు. ఆ సమయంలో యెరూషలేములో ఉండినవానియొద్దకు పంపించాడు. హేరోదు

యేసునకు విరోధముగా చేయబడిన నేరారోపణల గూర్చి యోచించుటకు నిరాకరించాడు. దానికి బదులుగా, అతని వినోదార్థమై యేసు ఒక సూచక క్రియను చేయుటకు నిరాకరించినప్పుడు, హేరోదు యేసును పరిహసించుట ద్వారా తానును తన సైనికులును వేడుకచేసికొన్నారు. అటుతరువాత, యేసును మరలా పిలాతునొద్దకు పంపించాడు. ఈ నేరము యొక్క న్యాయ విచారణ సందర్భములో ఏర్పడిన వారి సహవాసము ద్వారా, ఒకప్పుడు శత్రువులై యుండిన హేరోదు మరియు పిలాతు వారిరువురి మధ్య నుండిన భేదాభిప్రాయములను పరిష్కరించుకొని సన్నిహిత స్నేహితులయ్యారు (లూకా 23:12).

పిలాతు, మరొక పర్యాయము ఆయన యొద్దకు తీసికొనిరాబడిన యేసును చూచి, చేయునదేదిలేక యేసును విడుదల గావించుటకు తెగింపుతో కూడిన ప్రయత్నములు చేయుటకు మొదలుపెట్టాడు. ఇదైనా యేసు శత్రువులకు సంతృప్తి కలుగజేస్తుందేమోనని ఆశించినవాడై, యేసును కొరడాతో దెబ్బలు కొట్టవలెనని ప్రతిపాదించాడు. కానీ వారు దానితో తృప్తిచెందలేదు. గనుక యూదులు ఎలాగైనా అందరికీ అన్ని చోట్లా తెలిసిన ఒక నేరస్థున్ని విడుదల చేయుట కంటే యేసును మరణ దండన నుండి తప్పించుటకు తప్పక ఇష్టపడుదురని నిరీక్షిస్తూ, బరబ్బా స్థానంలో యేసును విడుదల చేయుటకు ప్రతిపాదించాడు. ఇది కూడా పనిచేయలేదు సరికదా ఏ ప్రయత్నమూ ఫలితమియ్యలేదు. యూదులు "వీనిని సిలువవేయుము!, సిలువవేయుము!" అని కేకలు వేసారు (మత్తయి 27:22, 23; మార్కు 15:13, 14; లూకా 23:21). బరబ్బా కాదు కాని యేసే మరణించవలెనని ప్రజలు దృఢనిశ్చయంతో ఉండిరి. గనుక పిలాతు రక్తపిపాసత్వంగల మనస్తత్వంతో కూడిన వారి దృఢనిశ్చయమును అర్థంచేసికొన్నాడు; ఆతడు యూదుల కోరిరను తీర్చనట్లయితే, వారు అల్లకల్లోలమును ఆరంభిస్తారనియు తత్ఫలితంగా ఆయన తన పై అధికారుల ఇరుకులో పడిపోవుననియు భయపడిపోయాడు. కాబట్టి, వారి కోరిక మేరకు సమ్మతించాడు. యేసు విషయం యిక తనకేమి ఎరుకలేదంటూ తన చేతులు కడుగుకొని యేసు సిలువవేయబడునట్లు ఆయనను విడుదల చేసాడు.

ఈ విషయమంతా ముగియుటకు ఒక రాత్రి సమయమంతా అవసరమయ్యింది. యూదులు యేసును రెండు పర్యాయాలు చిత్రహింసకు గురిచేసారు; వారు గంటల తరబడి ఆయనను ఎగతాళి చేసారు. యేసు ముఖముపై ఉమ్మివేసారు; ఆయనను బెత్తంతో మొత్తారు; అరచేతులతో కొట్టుచు పిడిగుద్దులు గుద్దారు; ఆయన కళ్లకు గంతలు కట్టి, ఆయనను కొట్టుచు, "నిన్నెవరు కొట్టారు?" అంటూ హేళనగా ప్రశ్నించారు. పిలాతు సైనికులు ఒక ముళ్ల కిరీటమును అల్లి ఆయన తలపై పెట్టారు. వారు, కూడా, ఆయనను ఎగతాళి చేసారు, పిడిగుద్దులు గుద్దుచు లాటితో బాదారు. అంతవరకు యేసునకు విరోధంగా చేయబడిన ఎటువంటి శారీరక దూషణ కంటెను ఘోరాతి ఘోరంగా వారు యేసు పట్ల ప్రవర్తించారు, ఆయనను కొరడా దెబ్బలు కొట్టారు.

ఫ్రెడెరిక్ డబ్ల్యు. ఫర్రార్ కొరడా దెబ్బల ప్రక్రియను ఇలా వర్ణించాడు:

> నిస్సంతోషంగా బాధనొందుచుండినవాడు బహిరంగంగా బట్టలు తీసివేయబడినాడు, వెనుకకు వంచబడి అతని చేతులు ఒక స్తంభానికి కట్టివేయబడినవి, ఆ తరువాత, వీపు భాగంలో తీవ్రంగా కంపించిపోవుచుండిన నరాలపై, దెబ్బ గట్టిగా తగులుటకు అవి బరువైనవిగా ఉండునట్లు వాటి చివరలో పదునైన అంచులుగల ఎముకలు మరియు సీసము

> ముక్కలు కలిగియుండిన తోలువారుపట్టతో పిడిగుద్దులు బాదబడినవి; ఈ దెబ్బలు కొన్ని పర్యాయాలు యాదృచ్ఛికంగా ఆయనపై బడినవి – కొన్ని పర్యాయాలు, భయంకరమైన అనాగరకతతో కూడిన క్రూరత్వముతో, ఉద్దేశపూర్వకంగా – ముఖము మరియు కళ్లపై కొట్టబడినవి. ఆ శిక్ష, ఎంత రోతగా ఉండినదంటే చర్మమును చినగ్గొట్టునటువంటి వేదన వలన, సాధారణంగా దానికి బలైనవాడు సొమ్మసిల్లిపోవును, తరుచుగా మరణిస్తాడు; ఇంకా అతి తరుచుగా నేరస్థుడు అవమానానికి గురిచేయబడినందువలన కలుగు మానసిక ఒత్తిడి మరియు నరముల బలహీనత వలన కలుగు భయంకర పిరికితనముతో నాశనముగునట్లు దూరముగా పంపివేయబడినాడు.[1]

"యేసు నిజముగా శ్రద్ధవహిస్తాడా?" అని నీవు అబ్బురపడు ప్రతిసారి, ఆయన నీ కొరకే ఇటువంటి కొరడా దెబ్బలను సహించుటకు చాలినంత శ్రద్ధ వహించాడని జ్ఞాపకమునకు తెచ్చుకొనుము.

*క్రీస్తును సిలువవేసినదెవరు?* న్యాయవిచారణ ముగిసిన తరువాత, యేసు సిలువవేయబడుటకు తీసికొనిపోబడినాడు. ఆయన విధి నిర్ణయింపబడినది. ఇంతకూ క్రీస్తును సిలువవేసినదెవరు? ఆయన శత్రువులు మరియు ఆయన స్నేహితులు ఆయనను సిలువవేసారు.

క్రీస్తును ఆయన శత్రువులు సిలువవేసారు; ఏలయనగా వారు, అసూయ చేత, అవతలివారు చెప్పినట్లు చేయు తలారీలకు అప్పగించారు. వారు యేసు చెప్పిన ఉపదేశములలోగల సత్యమును పట్టించుకొనుటకు ప్రత్యామ్నాయంగా వారి సొంత సాంప్రదాయాలను అంటిపెట్టుకొని యుండుటకే ఎన్నుకొన్నారు. ఈనాడు సహితము కొందరు ఇదే విధంగా, ఆయనను మరియు ఆయన వాక్యమును నిరాకరించుట ద్వారా యేసును సిలువవేయుచున్నారు. వారి సొంత అభిప్రాయములను గట్టి పట్టుదలతో అంటిపెట్టుకొని యుంటూ వారి మానవ కల్పితమైన మానవసంబంధ ఇష్టపూర్వక అలవాట్లను ఆయన ఉపదేశములు ఖండించుచున్నప్పటికిని వారు ఆయనను వెంబడించుటకు నిరాకరించుదురు.

పిలాతు యేసు గూర్చి నిరపరాధి యని చెప్పుకొంటూ తన చేతులు కడుగుకొనుట ద్వారా ఆయన క్రీస్తును సిలువవేసాడు. ఆయన తన చేతులు కడుగుకొనుచుండగా పళ్లెములోని నీళ్లు చేయుచుండిన తపతప శబ్దము నైతికంగా పిరికివాడై యుండిన వాని యొక్క మనస్సాక్షిని మరింత ప్రశాంతపర్చుచుండిన దుష్టుని తంత్రమై యుండినది. అది వాని దోషభావమును తొలగించలేకపోయినది. ఈనాడు ప్రభువు గూర్చి తటస్థంగా ఉండుటకు ప్రయత్నించువారు కూడా ఆయనను సిలువవేయుచున్నారు. యేసు అందించుచున్న ఆహ్వానమును అలక్ష్యము చేయుట ఆయనను తృణీకరించి సిలువవేయుటయై యున్నది.

యేసు స్నేహితులు సహితము ఆయనను సిలువవేసారు. యేసును ముద్దుపెట్టుకొనుట ద్వారా యూదా ఆయనను అప్పగించాడు; పేతురు శపించుకొనుట ద్వారా యేసును ఎరుగనని బొంకాడు. ఏ ఒక్కడును – యేసు ప్రభువు దినాన విజయోత్సవముతో యెరుషలేములో ప్రవేశించుచుండినప్పుడు "హోసన్నా!" అని కేకలు వేసిన వారిలో నుండి ఏ ఒక్కడును – చివరకు ఆయనను గూర్చి ఒక మంచి మాటైనను పలుకలేదు. ఆయన స్నేహితులు నోరు విప్పి మాటలాడక మౌనంగా ఉండుటనుబట్టియే యేసు సిలువవేయబడినాడు! నేటికిని యేసు స్నేహితులు ఆయనను సిలువవేయుచునేయున్నారు. మనము ఆయనను ఒంటరిగా

విడిచిపెట్టి వెళ్లుచుందుము, ఆయనను అప్పగించుచుందుము, మరియు మన నోళ్లద్వారాను మన జీవితాల ద్వారాను ఆయనను ఎరుగమని బొంకుదుము. మనము ఆయనను ముప్పది వెండి నాణెముల కంటే తక్కువకే అమ్ముకొందుము, ఏలయనగా క్రీస్తు కొరకు నోరు తెరచి మాటలాడుటకు బదులుగా మనము మౌనంగా ఉంటున్నాము.

## నాలుగవ అంకము: సిలువ

రోమా సైనికులు యేసును “కపాలము” అనబడిన కొండకు తీసికొని వెళ్లి ఆయనను అచ్చట ఒక సిలువకు మేకులతో దిగగొట్టారు. ఆయనకు కుడి వైపున ఒకడును ఎడమ వైపున ఒకడును ఇద్దరు దొంగలను కూడా సిలువవేయబడ్డారు. సైనికులు ఆయన వస్త్రముల గూర్చి చీట్లు వేసికొన్నారు. ఆ దారిన వెళ్లుచుండినవారు ఆయనను అపహసించారు. ఇంత జరుగుచుండిన స్నేహితులు ఊరకనే చూస్తూ ఉన్నారు. పరిశుద్ధ బైబిలులో వ్రాయబడినట్లు, యేసు సిలువ మీద వ్రేలాడుచుండినప్పుడు ఏడు మార్లు ప్రత్యేక పలుకులు పలికాడు:

1. వారు ఆయనను సిలువవేసినప్పుడు, ఆయన “తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుము” అని ప్రార్థించాడు (లూకా 23:34).
2. రెండవ ప్రక్కన సిలువవేయబడి యుండిన దొంగ తనను ఆయన రాజ్యములో జ్ఞాపకము చేసికొనవలసినదని మనవి చేసినప్పుడు, ఆయన, “నేడు నీవు నాతో కూడ పరదైసులో ఉందువు” అని వాగ్దానము చేసాడు (లూకా 23:43).
3. ఆయన తన తల్లిని యోహాను చేతులకు అప్పగించుచు, “అమ్మా, ఇదిగో నీ కుమారుడు!” అని ప్రేమపూర్వకంగా చెప్పాడు; తరువాత, “ఇదిగో, నీ తల్లి!” అని యోహానుతో చెప్పాడు (యోహాను 19:26, 27).
4. దేశమందంతటను చీకటి కమ్ముకొనినప్పుడు, ఆయన “నా దేవా, నా దేవా, నన్నెందుకు చెయ్యి విడిచితివి” అని బిగ్గరగా కేకవేసాడు (మత్తయి 27:46; మార్కు 15:34).
5. మరణము సమీపించుచుండినప్పుడు ఆయన, “దప్పిగొనుచున్నాను” అన్నాడు (యోహాను 19:28). ఒక స్పంజీ చిరకను హిస్సోపు పుడకకు తగిలించి ఆయన నోటికి అందిచ్చారు.
6. యేసు మరణించక మునుపు, ఆయన, “సమాప్తమైనది!” అని పలికాడు (యోహాను 19:30).
7. ఆయన తన తుది శ్వాస వదిలిపెట్టుచుండగా, “తండ్రీ, నీ చేతికి నా ఆత్మను అప్పగించుకొనుచున్నాను” అని పలికాడు (లూకా 23:46). ఆయన యీలాగు చెప్పి తన ప్రాణము విడిచాడు.

అద్భుతకరమైన సంఘటనలు యేసు మరణమునకు సాక్షి ముద్రవేసాయి. దేవాలయము లోని తెర పైనుండి క్రిందికి రెండుగా చినిగినది, భూమి కంపించినది, బండలు బ్రద్దలయ్యాయి, యేసును సిలువవేయుటలో బాధ్యత వహించిన శతాధిపతి మనస్సు కరిగినవాడై, “నిజముగా ఈ మనుష్యుడు దేవుని కుమారుడే” అని ఆశ్చర్యముతో పలికాడు (మార్కు 15:39).

సిలువవేయబడినవారు మరణించారని నిర్ధారించుటకు రోమా సైనికులు వారి

యొద్దకు వచ్చారు. యేసు అదివరకే మరణించాడని వారు కనుగొన్నారు, కానీ వారు యేసు మరణించాడని రెట్టింపు నిర్ధారణ చేసికొనుటకు బల్లెముతో ఆయన ప్రక్కలో పొడిచారు. "వెంటనే రక్తమును నీళ్లును కారెను" (యోహాను 19:34).

క్రీస్తు మరణమును యింకా కొంచెము ఎక్కువ జాగ్రత్తతో పరిశీలనగా చూద్దాము. ఆయన సిలువవేయబడుటను గూర్చిన వివరములు పాపము ఎంత భయంకరమైనదో మరియు క్రీస్తు ప్రేమ ఎంత ఆశ్చర్యజనకమైనదో మనము చూడగలుగునట్లు మనకు సహాయము చేయును. ఆయన సహించిన దానంతటి గూర్చి మనము చదువునప్పుడు, "ఆయన ఇదంతా నా కొరకే సహించాడు" అని మనకు మనమే చెప్పుకొనగలిగినట్లయితే మనము క్రీస్తు పడిన శ్రమల గూర్చి హర్షించుదుము.

సిలువ మీద మరణము నెమ్మదిగా సాగుచుండును మరియు అది వేదనతో కూడినదైయుండును. పురుషులు సిలువవేయబడినప్పుడు వారు మరణించుటకు కొన్ని పర్యాయాలు రెండు లేదా అంత కంటె ఎక్కువ రోజుల సమయం తీసికొనుచుండెను. సరికదా ఇది తీవ్రంగా బాధాకరమైనదై యుండుట ఒకరు త్వరగా తక్కువ సమయంలో మరణించుటకు అదనపు అనుకూలంగా ఉండినది. ఇంతేగాక, వారు బహిరంగముగా సిలువవేయబడిరి, గనుక సిలువవేయబడవలసిన వ్యక్తి సాధారణంగా దాదాపుగా దిగంబరియై యుండెను, ఇది అతని అవమానమునకు అదనపు బలమై యుండినది, మరియు లెక్కింపజాలని కీటకములు అతనిని బాధించుటకు సులభముగా గురిచేసినది. మొదట్లో, ఈ దండన బానిసలు మరియు విప్లవకారుల కొరకు ప్రత్యేకింపబడినదై యుండెను. క్రీస్తు దినములలో సహితము, అల్ప శ్రేణికి చెందిన నేరస్థులు మాత్రమే సిలువవేయబడుచుండిరి.

ఫర్రార్, *లైఫ్ ఆఫ్ క్రైస్ట్,* అను తన పుస్తకంలో, సిలువవేయబడు ప్రక్రియను ఈ విధంగా వర్ణించాడు:

> ఆయన హింసింపబడు పరికరముపై నిటారుగా పరుండబెట్టబడెను. అడ్డముగా నుండు దూలముపై చేతులు చాపబడినవి; సరిగ్గా అరచేతి మధ్యలో, మొదట కుడి చెయ్యి, ఆ తరువాత ఎడమ చెయ్యి, ఒక పెద్ద యినప మేకు ఉంచబడి, సమ్మెట దెబ్బలతో, కర్ర లోనికి, కర్రను చేతి కండరమును నలుగగొట్టుచు, భరింపరాని బాధతో, చేతులలోని సున్నితమైన నరములు మరియు కండరముల గుండా దిగగొట్టబడినవి. ఆ తరువాత కాళ్లు పూర్తి నిటారుగా క్రిందికి లాగబడినవి; వేరు వేరుగా రెండు కాళ్ల గుండా, సాధ్యమైతే రెండు కాళ్లను ఒకదానిపై మరొకటి ఉంచి, రెండింటి గుండా మరొక పెద్ద మేకు కంపించుచు రక్తము కారుచుండిన కాళ్ల కండరములను చించుకొంటూ దిగగొట్టబడినది ... .
>
> అప్పుడు శపింపబడిన మ్రాను – దానిపై సజీవముగా నుండి నిస్సహాయ స్థితిలోను వేదనతోను వ్రేలాడుచుండిన మనిషి బరువుతో, ప్రతి కదలిక మూలమున చేతులలోను కాళ్లలోను తాజాగా ఒక పగులు ఏర్పడుచుండుట వలన కలుగుచుండిన తాజా హింసలను అనుభవించుచుండగా – నెమ్మదిగా బలమైన హస్తముతో పైకెత్తబడినప్పుడు దాని క్రింది చివరి భాగము దానిని నిలువబెట్టుట కొరకు త్రవ్వబడిన గుంటలో ఉంచబడినది. కాళ్లు నేలకు ఆనుకొనకుండా కొంచము పైకి ఉండునట్లు జాగ్రత్త తీసికొనబడినది. ఎవరైనాగాని వానిని బాదవలెనని కోరినట్లయితే బాధితుడు వాని చేతికందునంత సమీపములో ఉండెను, వారి ముఖ కవళికలతోగాని అంగవిక్షేపములతోగాని వానిని అవమానించుటకును ద్వేషించుటకును ఆశించు వారికి ఎంతో దరిదాపుల్లో ఉండెను. ఆ దారిన ప్రతినిత్యమూ కదలివెళ్లుచు, అట్టి దృశ్యమును వారు తేరి చూచినప్పుడు అది వారి కన్నీరు రక్తమయమైనదై

> కారునట్లు చేయునదైను, అత్యంత అనాగరకమైన హృదయాలను ఎల్లప్పుడు చిత్రించు భయంకరమైన విషయమేమిటో చూడవలెనను కోరికతో గుమికూడిన జనసమూహముచేత, దూషింపబడుటకు, దౌర్జన్యంగా శారీరక చెరుపు చేయబడుచు, యాతనపెట్టబడుటకు సహితము వీలగునట్లు వాడు గంటల తరబడి వ్రేలాడుచునే యుండవచ్చును ... .
>
> ఏలయనగా నిజముగా సిలువవేయబడుట ద్వారా మరణించుటలోగల బాధ మరియు చావు అంతా చేర్చుకొనగల భయంకరము మరియు పాశవికమైనది – కళ్లు చీకట్లు కమ్ముట, తిమ్మిరెక్కుట, దాహము, ఆకలితో అలమటించుట, నిద్రలేమి, అఘాతము వలనవచ్చు జ్వరము, ధనుర్వాతము, బహిరంగ అవమానము, దీర్ఘ కాలము కొనసాగుచుండు యాతన, మున్ముందేమి సంభవింపనైయున్నదో అను భయభీతి, చికిత్స చేయబడని గాయములను ఏదో ఒక విధంగా అణగార్చుట కలుపబడి యున్నట్లు అగుపించు – ఇవన్నీ కూడ అవి యిక ఏ మాత్రమును సహింపబడలేవను స్థాయికి వచ్చునంత వరకు తీవ్రమైన, బాధనొందుచున్నవానికి స్మృతివిహీనత నుండి ఉపశమనము కలుగజేయుటకు కేవలము ఒకటి రెండు క్షణాలకు ముందు ఆగిపోయినవి. బాధితుని దేహము అసహజమైన స్థితిలో ఉంచబడినందువలన ప్రతి కదలిక భరించరానంత నొప్పిని కలుగజేయుచుండినది; గాయములతో చీలిపోయి యుండిన నల్లరక్తనాళములు (సిరలు) ... వెలుపటి కలుషిత వాతావరణములకు తెరువబడి యున్నందున తాపకారి మంటతో కూడిన వాపు ఏర్పడి, రక్తప్రసరణము అగిపోవుట వలన కలుగు కండరముల క్షయము నెమ్మదిగా చొరబడినది; ఎర్రరక్తనాళములు (ధమనులు) – ప్రత్యేకంగా తల మరియు కడుపుకు సంబంధించినవి – అదనపు రక్తముతో వాచిపోయి అణగార్చబడినవి; ప్రతి విధమైన దౌర్బల్యము నెమ్మదిగా ఎక్కువగుచుండిన కొలది, వాటికి తోడుగా మంట మరియు ఉగ్రరూపముతో కూడిన దాహము యొక్క భరించరాని బాధ కలిగినది ... .[2]

క్రీస్తు అనుభవించిన భరింపశక్యముకాని బాధతో పొందిన మరణము ఇటువంటిదై యుండినది. ఆయన నీ కొరకే మరణించాడు, ఈ వాస్తవమును జ్ఞాపకముంచుకొనుము.

*నీకును నాకును సిలువ ఏమని అర్థమీయవలెను?* మొదటిగా, మన పాపములు క్షమింపబడుటకు మనకున్న సాధ్యత ఇదొక్కటే అని మనము గుర్తించవలెను. రెండవదిగా, క్రీస్తు చూపిన గొప్ప ప్రేమ, మరియు మన యొక్క గొప్ప పాపిష్టితనమును మనము అమితాశ్చర్యముతో తేరి చూచునట్లు మనలను అది పురికొల్పవలెను. సిలువమరణము మన యొక్క అయోగ్యతనుబట్టి మనలను భయకంపితులను చేయవలెను. మూడవదిగా, సిలువ మరణము మనకున్న సమస్తము క్రీస్తునకు ఇచ్చునట్లు మనలను ప్రేరేపింపవలెను. యేసు మన కొరకు తననుతాను అర్పించుకొన్నాడు; గనుక మనము ఆయనకు సంపూర్ణంగా సమర్పించుకొనవలెనని ఇప్పుడు ఆయన మనలను అడుగుచున్నాడు.

**ఐదవ అంకము: పునరుత్థానము**

మనము ధ్యానించుచున్న ఇతివృత్తము యేసు మరణముతో ముగియదు. సిలువ మరణము తరువాత, మనము వీక్షించాల్సిన సన్నివేశము ఒకటున్నది: పునరుత్థానము. సిలువ చరితము యేసు సిలువమీద మరణించుటతో ముగిసినట్లయితే, మనలను ఆకర్షించునది ఏమియులేనిదై అది ఒక విషాదాంతమై యుండును – మన నిత్యజీవ నిరీక్షణ శాశ్వతముగా అణచివేయు ఒక నిరాధారమైన పీడకలయై యుండును. అది పరాజయము పాలైన కథయై యుండును. దానికి బదులుగా, అది ఒక విజయ కథయై యున్నది! యుగాలలో ఎప్పుడైనను

గెలుపొందిన వాటికంటే యేసు పునరుత్థానం మాత్రమే అత్యంత గొప్ప విజయమై యున్నది. అది ఇలా వ్రాయుబడి యున్నది,

> విశ్రాంతిదినము గడచిపోయిన తరువాత ఆదివారమున, తెల్లవారుచుండగా మగ్దలేనే మరియయు వేరొక మరియయు సమాధిని చూడవచ్చిరి. ఇదిగో ప్రభువు దూత పరలోకమునుండి దిగివచ్చి, రాయి పొర్లించి దాని మీద కూర్చుండెను; అప్పుడు మహాభూకంపము కలిగెను. ఆ దూత స్వరూపము మెరుపువలె నుండెను, అతని వస్త్రము హిమమంత తెల్లగా ఉండెను. అతనికి భయపడుటవలన కావలివారు వణకి చచ్చినవారివలె నుండిరి. దూత ఆ స్త్రీలను చూచి – మీరు భయపడకుడి, సిలువవేయబడిన యేసును మీరు వెదకుచున్నారని నాకు తెలియును; ఆయన ఇక్కడ లేడు; తాను చెప్పినట్టే ఆయన లేచి యున్నాడు; రండి ప్రభువు పండుకొనిన స్థలము చూచి … (మత్తయి 28:1–6).

ఆయన పునరుత్థానముతో మన ఒక్కొక్కరికి అవసరమై యున్న నిరీక్షణ పుట్టినది. మనము లేపబడుదుము! మనము మన గత పాపముల నుండి లేపబడగలము, సమాధి నుండి లేపబడగలము, మరియు చివరకు పరలోకము లోనికి చేర్చబడుటకు లేపబడగలము.

లేపబడుటకు, మనము ప్రభువు వైపునకు తిరిగి సిలువ మీద మరణించిన క్రీస్తు చేత రక్షింపబడి, బాప్తిస్మములో ఆయనతో కూడ పాతిపెట్టబడి నీటి నుండి బయటికి వచ్చి నూతన జీవముతో ఆయనతో కూడ నడచివెళ్లవలెను (రోమీయులకు 6:3, 4).

## ముగింపు

ఇహలోక సంబంధమైన సమస్యల విషయంలో సువార్త ఎటువంటి సామాన్యమైన పరిష్కారమును ప్రతిపాదించదు. మనము ఒక ప్రశాంతమైన, శాంతిసమాధానములతో కూడిన వాతావరణములో జీవించుదుమని ఎటువంటి వాగ్దానము సహితము అది ఇవ్వదు. కష్టాలులేని సౌకర్యవంతమైన జీవితము గూర్చి అది హామీ ఇవ్వదు. దానికి బదులుగా, అది ఒక సిలువను ప్రతిపాదించును – దాని మీద ఉన్నవాడు నలుగగొట్టబడినవాడు, చేతుల్లో కన్నాలు మరియు ప్రక్కలో గాయమున్నవాడు, కానీ ఆయన హృదయము నిండా ప్రేమ ఉన్నది. అది ఆయన రక్తమును తప్ప యింకేమీ ఇవ్వదు, ఆ రక్తము మన కొరకు ఘోరాతి ఘోరమైన మరణము వలన చిందింపబడినది.

ఏదిఏమైనా, ఈ ప్రతిపాదన చాలును. యేసు రక్తము నీ పాపములను కడిగివేయగలదు. ఆయన ఉపదేశములు మరియు ఆయన చూపిన మాదిరి నీకు నీ జీవితమందంతటను సహాయపడగలవు, మరియు చివరకు యేసు నిన్ను పరలోకములోనున్న ఇంటికి నిత్యత్వము నిమిత్తమై తీసికొని వెళ్లును. యేసు నీ కొరకే మరణించాడు. నీవు యేసు స్వరమును ఆలకించి కడుగబడుటకు ఆయనకు లోబడినట్లయితే క్షమాపణలో మహదానందం ఎప్పటికీ నీదౌతుంది!

---

సూచనలు

[1]Frederic W. Farrar, *The Life of Christ,* vol. 2 (New York: E. P. Dutton & Co., 1874), 379-80.
[2]Ibid., 497-99.